క్లుప్తంగా

టమాట రైతులకు ఊరట



మార్కెట్లో అమ్మకానికి ఉంచిన టమాట

కూడేరు: పది రోజులుగా మార్కెట్లో టమాట ధర పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం కిలో టమాట ధర రూ.40 పలుకుతోంది. ఇన్ని రోజులూ కిలో టమాట రూ.10 లోపే ఉండేది. దీంతో రైతులు ఆందోళన చెందేవారు. మండల వ్యాప్తంగా సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో రైతులు టమాట పంట సాగు చేశారు. 15 కేజీల టమాట బాక్సు నాణ్యతను బట్టి రూ.300 నుంచి 450 వరకు ధర పలుకుతోంది. టమాటాలు తొలగించేందుకు కూలీల ఖర్చు, అనంతపురం మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చు పోనూ కొంత చేతికందుతోందని రైతులు చెప్తున్నారు.

150 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు



ఉరవకొండ: నియోజకవర్గంలో 150 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 259 పోలింగ్ కేంద్రాలు ఉండగా, తాజాగా మరో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో వాటి సంఖ్య 263కు చేరింది. విడపనకల్లు మండలంలోని 51 పోలింగ్ కేంద్రాల్లో 21 పోలింగ్ కేంద్రాలు, వజ్రకరూరు మండలంలోని 51 పోలింగ్ కేంద్రాల్లో 24 పోలింగ్ కేంద్రాలు, ఉరవకొండ మండలంలో 80 పోలింగ్ కేంద్రాల్లో 52 పోలింగ్ కేంద్రాలు, బెళుగుప్ప మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో 30 పోలింగ్ కేంద్రాలు, కూడేరు మండలంలోని 34 పోలింగ్ కేంద్రాల్లో 23 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. 1,400 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలను విడగొట్టి కొత్తగా నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

ఆలయానికి రూ. 2.7 లక్షల విరాళం



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

శెట్టూరు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి శెట్టూరుకు చెందిన గొల్ల బాదప్ప కుటుంబ సభ్యులు రూ.2.70 లక్ష విరాళం అందించారు. పురాతన ఆంజనేయ స్వామి ఆలయాన్ని గ్రామస్తులు నూతనంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆలయ నిర్మాణపు పనులకు బాలప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారులు బాలరాజు, కెంచప్ప, పల్లవరాజు, చిన్న బాలకృష్ణ ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు.కార్యక్రమంలో నాయకులు సోమనాథ రెడ్డి, హరినాథ రెడ్డి, కేశవ రెడ్డి, బొమ్మజ్జి రమేష్, తిప్పేస్వామి, రామకృష్ణ, ఆదిశేషు, వీరభద్రప్ప, వెంకటేశులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మారెప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్రహ్మసముద్రం : మండలంలోని బుడిమేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భీమప్పగారి మారెప్ప (50) ఆకస్మాత్తుగా మృతిచెందాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం మృతుడి స్వగృహానికి వెళ్లి మారెప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఇస్మాయిల్ , మర్రిస్వామి, శీనా, ఆనంద్, లక్ష్మణమూర్తి, శివప్ప, దుర్గేష్., మల్లి, లక్ష్మన్న, మారెన్న పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే క్రైస్తవుల సంక్షేమం



పూలకుంట గ్రామంలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీతోనే క్రైస్తవుల సంక్షేమం సాధ్యమని పాస్టర్లు, క్రైస్తవులు వైజాగ్ రవి, ఆనంద్‌హరి, డేనియల్, సురేష్, జాన్‌పాల్, వెంకటేశులు, బాబు తదితరులు స్పష్టం చేశారు. మండలంలోని పూలకుంట గ్రామంలో పాస్టర్లు సమావేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను గడప వద్దకే తెచ్చి ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న మళ్లీ సీఎం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేద్దామన్నారు. వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. త్వరలో జరగబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణకు మద్దతు పలికి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

ఉట్టిపడిన తెలుగు సంప్రదాయం

- ఊరూరా ఉత్సాహంగా ఉగాది పండుగ
- ఆలయాలకు పోటెత్తిన భక్త జనం
- పంచాంగాన్ని ఆవిష్కరించిన అర్చకులు

రాయదుర్గం: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడింది. మంగళవారం ఉగాది పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. తీపి, కారం, పులుపు, వేపపూతతో తయారు చేసిన పచ్చడిని ఇంటింటా సేవించారు. తెలుగువారి నూతన సంవత్సరానికి కోటి ఆశలతో స్వాగతం పలికారు. ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలతో పాటు ఊరురా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. యువకులు నిమ్మకాయలు విసరడం, టెంకాయలు పగులగొట్టడం లాంటి పోటీలు ఆడారు.

భక్తి శ్రద్ధలతో పంచాంగ శ్రవణం: క్రోధి నామ సంవత్సరం అందరిలోనూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ప్రార్థించారు. తన స్వగృహంలో నూతన పంచాంగ శ్రవణం చేయించారు. యువత అన్ని రంగాల్లో ముందుడాలని కోరుకున్నారు. పలు ఆలయాల్లోనూ పంచాంగ శ్రవణం చేశారు. రాశిఫలాల వారీగా పంచాంగం చదివి వినిపించారు.

కణేకల్లుల్లో ఉగాది పండుగ

కణేకల్లు: కణేకల్లులో ఉగాది పండుగ వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. క్రోధి నామ సంవత్సరంలో అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ ప్రజలు చిక్కణ్ణేశ్వరస్వామి, స్వయంభేశ్వర, సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్త జే ప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ సీఈఓ కృష్ణారెడ్డి, బ్యాంకు రాజన్న, కురుబ తిమ్మరాజు, ప్రసాద్, మంజునాథ, పెండేకల్లు నాగరాజు, బారిక వన్నూరుస్వామి, ముక్కన్న పాల్గొన్నారు.



కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయంలో పంచాంగాన్ని పఠిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. క్రోధినామ సంవత్సర ఉగాది పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం, నేసేపేటలోని సత్యనారాయణస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల్లో స్వామికి అభిషేకాలు చేశారు. సాయంత్రంలో ఆలయంలో ప్రధాన అర్చకులు నాగభూషణంశాస్త్రి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. పట్టణంలోని వేణుగోపాలస్వామి, శ్రీదశభుజ గణపతి, జంభుకేశ్వరస్వామి, చెన్నవీర స్వామి, మార్కండేయస్వామి ఆలయం, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి, వాకిళ్లకు మామిడి ఆకులు, పూలతో తోరణాలను కట్టి అలంకరణ చేశారు. వేపాకుతో తయారు చేసిన పచ్చడి, తీపి వంటలను తయారు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా ఆరగించారు.



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి



అలంకరణలో ఓబుళాపురం మహాలక్ష్మి

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

బొమ్మనహాళ్: క్రోధి నామ సంవత్సర ఉగాదిని మండలంలో మంగళవారం ఉత్సాహంగా జపుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బొమ్మనహాళ్‌లో వెంకటేశ్వరస్వామి, సత్యనారాయణ స్వామి, నేమకల్లు ఆంజనేయస్వామి, ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి, కందేపల్లి ఆంజనేయ స్వామి, సంగమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ప్రముఖ ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేయించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కూడేరు: ఉగాది పండుగ వేడుకలను మంగళవారం మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బసాపురం ఆంజనేయ స్వామి ఆలయానికి, కూడేరులోని రామాలయం, జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి, కలగళ్ల, కడదరకుంటలోని ఆంజనేయ స్వామి, ముద్దలాపురం, కరుట్లపల్లిలోని రామాలయాలు, కొర్రకోడులోని శివాలయంతో పాటు మరికొన్ని గ్రామాల్లోని ఆలయాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా మంగళవారం ఉగాది పండుగ సంబరాలను ప్రజలు ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. షడ్రుచులతో ఉగాది పచ్చడితోపాటు పిండి వంటలు చేసుకుని ఆనందంగా పండుగ నిర్వహించారు. మండలంలోని పంపనూరు ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మంజునాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరులోని భైరవేశ్వరుని ఆలయం, అక్కమ్మదేవతలు, అంకాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆత్మకూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద పంచాంగం చదివి వినిపించారు. అక్కమ్మదేవతల గంపను గ్రామోత్సవం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

రాప్తాడు: మండల వ్యాప్తంగా క్రోధి నామ సంవత్సర వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. రాప్తాడులోని పండమేటి వెంకటరమణస్వామి, నీలకంఠేశ్వరస్వామి, సాయిబాబా ఆలయం, పెద్దమ్మ, మారేమ్మ, ముత్యాలమ్మ ఆలయాలు, అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత ఆలయం, హంపాపురంలోని మౌనగిరిక్షేత్రం, పుల్లలరేవు, యర్రగుంట గ్రామాల్లో చెన్నకేశవస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

భక్తులతో పోటెత్తిన చిన్నకదిరయ్యస్వామి దేవాలయం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకోని మరూరులోని చిన్నకదిరయ్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని చుట్టూ పక్క గ్రామాలే ప్రజలే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు ఆలయం చూట్టూ ఫలహారపు బండ్లు, ట్రాక్టర్లు తిప్పారు.



కూడేరు రామాలయంలో సీతారాములుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



రాయదుర్గం కోటలోని ప్రసన్న వెంకటరమణస్వామి

పార్కు ఆంజనేయస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో పార్కు ఆంజనేయస్వామి మూలవిరాట్

ఉరవకొండ: పట్టణంలోని పార్కు ఆంజనేయ స్వామి, పాతపేట ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉగాది పండుగ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, పూజలు చేశారు. చౌడేశ్వరి కాలనీలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆయలంలో ప్రత్యేక పూజలు చేశారు. పార్కు ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి భక్తులు ప్రత్యేకంగా ఆకుపూజ నిర్వహించి, పూజలు చేశారు.

చురుగ్గా ఆంజనేయుడి ఆలయ నిర్మాణం



ముద్దలాపురంలో నిర్మాణంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం

కూడేరు: మండలంలోని ముద్దలాపురంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఉన్న ఆలయం పాతబడి శిథిలావస్థకు చేరడంతో నూతనంగా ఆలయం నిర్మించేందుకు గ్రామస్తులు సంకల్పించారు. సుమారు రూ. 80 లక్షలతో ఆలయాన్ని నిర్మించనున్నారు.

బాలికల హాస్టల్‌కు స్టీమ్ బాయిలర్ వితరణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని శిల్పా బాలికల హాస్టల్‌లో స్టీమ్ కుకింగ్ నిమిత్తం నూతన స్టీమ్ బాయిలర్‌ను కళాశాల పూర్వ విద్యార్థి సి.చిరంజీవి (1963–68 బ్యాచ్) తరపున అందజేశారు. అదే విధంగా ఎల్లోరా హాస్టల్‌లో స్టీమ్ బాయిలర్‌ను మరమ్మతు చేయించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు.

పేదల పాలిట పెన్నిధి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్



ఫాదర్‌ఫెర్రర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య



ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, పార్టీ నేత ఉమా మహేశ్వర నాయుడు

కళ్యాణదుర్గం: ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జిల్లాకు అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య అన్నారు. ఫాదర్ 104వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ఆర్డీటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఫాదర్ విగ్రహం వద్ద పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడుతో కలిసి రంగయ్య నివాళులర్పించారు. కళ్యాణదుర్గానికి ఫాదర్ ఫెర్రర్ అందించిన సేవలను గుర్తు చేశారు. ఆర్డీటీతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కరువు ప్రాంతంలో ఆస్పత్రులతోపాటు గ్రామీణాభివృద్ధికి పాటు పడిన మహనీయుడిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, కంబదూరు జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, కళ్యాణదుర్గం ఎంపీపీ మారుతమ్మ, జేసీఎస్ కన్వీనర్లు అర్చన, ఆంజినేయులు, సీనియర్ నాయకులు సుధీర్, దొడగట్ట నారాయణ, గోళ్ల సూరి, రామచంద్ర, ఎంఎస్ రాయుడు, లక్ష్మన్న, తలారి సత్తి, నాగరాజు,అప్జల్, షేక్షావలి, హనుమంతరాయుడు, మల్లికార్జున, సురేష్, అజయ్, పాండు, చరణ్, వంశీ, జానీ, ఉమేష్, హబీబ్, జాకీర్, నల్లప్ప పాల్గొన్నారు.

ఉరవకొండ: పేదల పాలిట పెన్నిధి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు తెలిపారు. మంగళవారం ఫాదర్ ఫెర్రర్ జయంతి సందర్భంగా పట్టణంలోని విఠల్‌రుక్మిణీ వృద్ధాశ్రమంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చెన్నకేశవులు, డివిజన్ అధ్యక్షుడు రాయంపల్లి వెంకటేష్, శివ, మల్లికార్జున, మారెన్న, ఓబుళేసులు పాల్గొ న్నారు.

ఫాదర్ ఫెర్రర్‌కు ఘన నివాళి

శెట్టూరు: మండల కేంద్రంలోని విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు నివాళులర్పించారు. మంగళవారం మండల కేంద్రంలో ఫాదర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏటీఎల్ బాషా, రామకృష్ణ, కుమార్, రామాంజనేయులు, తిప్పేస్వామి, మైలారి, టైలర్ వన్నూరుస్వామి, నారాయణ పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఆర్డీటీ పాఠశాలల్లో ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఫాదర్ జిల్లాకు చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఆయన చూపిన సన్మార్గంలో అందరూ నడవాలని వారు ఆకాంక్షించారు. నిరుపేదలకు, విద్య , వైద్యం, గృహాలు అందించిన ఆయనకే దక్కుతుందని పలువురు పేర్కొన్నారు.

కనగానపల్లి: బలహీన వర్గాల కోసం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చేసిన సేవలు మరువలేనివని ఆర్డీటీ ఎస్టీఏలు శారదమ్మ, ఎల్లమ్మ తెలిపారు. మంగళవారం మండలవ్యాప్తంగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని నిర్వహించారు. ముక్తాపురంలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి ఆర్డీటీ సంస్థ ప్రతినిధులతో కలసి స్థానికులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఫెర్రర్ సేవలను వారు కొనియాడారు. ఆర్డీటీ మహిళా సంఘాలు స్పందించు- సాయమందించు కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. కోనాపురం, వేపకుంట, మద్దులచెరువు, పర్వతదేవరపల్లి, శివపురంలో కూడా ఫాదర్ అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సీటీ రామక్రిష్ణ, పీఎస్‌సీ సభ్యులు నరసింహమూర్తి, లక్ష్మి నరసమ్మ, చెన్నమ్మ, లక్ష్మిదేవి, నాగవేణి పాల్గొన్నారు.



శెట్టూరులో విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మండే వేసవి..జాగ్రత్తలు తప్పనిసరి

రాయదుర్గంటౌన్: రోజురోజుకూ ఎండ తీవ్రంగా ఉంది. ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. మండే వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. వడదెబ్బ లక్షణాలు తెలుసుకొని సరైన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలపై రాయదుర్గం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పి.మాధవిని తెలియజేశారు.



పి.మాధవి, రాయదుర్గం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

వడదెబ్బ అంటే ఏమిటి?

వాతావరణ ఉష్ణోగ్రతకు శరీరంలోని నీరు, లవణాల శాతం తగ్గిపోవడంతో కలిగే అనారోగ్య లక్షణాలనే వడదెబ్బ అంటారు. వడదెబ్బ లక్షణాలు ఎలా ఉంటాయంటే...శరీరం పాలిపోయి కళావిహీనవుమవుతుంది. శరీర ఉష్ణోగ్రత అత్యధిక స్థాయికి చేరుకొని, అనంతరం సాధారణ స్థాయి కన్నా తక్కువకు పడిపోతుంది. శరీరంలోని లవణాలు తగ్గిపోవడంతో సమతుల్యత లోపించి, తలనొప్పి, తల తిరుగుట, జ్వరం రావడం, మత్తునిద్ర, ఫిట్స్ లేదా పూర్తి అపస్మారక స్థితి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. నీరు చెమట రూపంలో పోవడం నిర్జలీకరణ (డీహైడ్రేషన్) జరిగి మూత్రం రావడం కష్టమవుతుంది. కొన్ని సందర్భాల్లో షాక్‌కు గురై మూర్ఛపోవడం, మరణం కూడా సంభవిస్తుంది.

వడదెబ్బకు చికిత్స ఎలా అంటే...

వడదెబ్బ తగిలిన వ్యక్తి దుస్తులు వదులు చేసి గాలి బాగా తగిలేలా బయలు ప్రదేశంలో ఎండ తగలకుండా ఉంచాలి. సేద తీరిన తర్వాత సాధ్యమైనంత త్వరగా చల్లని ద్రవ పదార్థాలను తాగించాలి. శరీరమంతా తడి గుడ్డతో బాగా తడపాలి. మజ్జిగ, ఉప్పు కలిపిన నిమ్మ రసం, ఎలక్ట్రోలైట్ ద్రావణం తాగించాలి. శరీరం ఉష్ణోగ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉన్నట్లయితే పారాసిటమోల్ మాత్ర ఇవ్వాలి. చల్లని నీటిని తరచూ తాగిస్తూ ఫ్యాను గాలి సోకేలా వ్యక్తిని విశ్రాంతి తీసుకోనివ్వాలి. షాక్‌కు గురైన సందర్భాల్లో పై ఉపశమన చర్యలు పాటిస్తూ వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

నివారణ చర్యలు ఇలా..

ఎండలో ఎక్కువగా సమయం గడపరాదు. చెట్టునీడలో ఉండాలి. ఎండలో వెళ్లేటప్పుడు గొడుగు గానీ టోపీగానీ వాడాలి. శరీరం వేడెక్కినట్లు గుర్తిస్తే చల్లని నీటి స్నానం చేయాలి. నీటిని ఎక్కువగా సేవిస్తూ ఉండాలి. వీలైనంత వరకు బయటకు వెళ్లేటప్పుడు వెంట మంచి నీరు తీసుకెళ్లాలి. ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలకు, వృద్ధులకు ఎండవేడిమి తగలకుండా చూసుకోవాలి.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని సర్పంచ్ యు.రామలింగమయ్య ఆధ్వర్యంలో మంగళవారం రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించారు. గ్రామ శివారులో జరిగిన దూలం పోటీలో మొత్తం ఏడు జతల వృషభాలు పాల్గొన్నాయి. పోటీలో గ్రామానికి చెందిన ఎడవలి ఈశ్వరయ్య వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. వెంకటస్వామి వృషభాలు రెండవ స్థానం, గోవిందు వృషభాలు మూడో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.5,016, రెండో బహుమతి రూ.2,016, మూడో బహుమతి రూ.1,016 రూపాయల నగదు బహుమతులను దాత సర్పంచ్ అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శివ, ఈశ్వరయ్య, బొజ్జన్న, రాముడు పాల్గొన్నారు.

సుంకులమ్మకు పూజలు



అనంతపురం అర్బన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక చెరువు కట్టపై వెలిసిన కొత్తకోట సుంకులమ్మ అమ్మవారికి పూజారమ్మ బెస్త వరలక్ష్మి విశేష పూజలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

హెచ్‌జీ రాములును కలిసిన మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం(డి హీరేహాళ్): ప్రముఖ రాజకీయ వేత్త, కర్ణాటక మాజీ ఎంపీ హెచ్‌జీ రాములును డి హీరేహాళ్ మండల కేంద్రంలోని తన నివాసంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి మంగళవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉగాది పర్వదినం సందర్భంగా బొకే అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మెట్టును రాములు సన్మాంచారు. మంచిచేసే నాయకుల వెంటే ప్రజ లు తప్పక నడుస్తారని, ప్రజా సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం స్థానిక రాజకీయ పరిస్థితుల పై చర్చించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం .వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు సింగాడి జగదీష్, మురడి మురళీమోహన్‌రెడ్డి, నాగలాపురం అంజిరెడ్డి, తొండె వెంకటేశులు, ఇతర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



హెచ్‌జీ రాములుకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం నాలుగో వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు అమ్మవారికి ఫల పంచామృతాభిషేకం, కలశ స్థాపన, గణపతి హోమం, ఆదిత్యాధి నవగ్రహ హోమం, 10 గంటలకు మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, 12 గంటలకు అమ్మవారికి హారతులు, మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మ వారిని మండల కేంద్రంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుశీలమ్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.